క్లుప్తంగా

## జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పనికల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ ఎస్.హరి హరరావు అన్నారు. కొండకిండాం గ్రామంలోని లింగాల కోనేరులో చేపడుతున్న ఉపాధిపనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పథకం ఏపీఓ కృష్ణవేణితో మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని అర్హతలు ఉండి ఇంకా జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి జాబ్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## యోగా శిక్షకురాలుకు సత్కారం



యోగా శిక్షకురాలు సుజాతను సత్కరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు దంపతులు, మహిళలు

చీపురుపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని యోగా కేంద్రంలో శిక్షకురాలు గవిడి సుజాతను గరివిడి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, లావణ్య దంపతుల నేతృత్వంలో యోగా శిక్షణ తీసుకుంటున్న మహిళలంతా శుక్రవారం సత్కరించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ, డీఎస్పీ ఏఎస్.కళ్యాణ్ చక్రవర్తి, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. పలువురు మాట్లాడుతూ యోగా శిక్షణ ఇవ్వడంలో సుజాత చొరవ అభినందనీయమన్నారు. ఇలాంటి శిక్షకులు ఉండడం అదృష్టంగా భావించాలన్నారు.

## బీమా పరిహారం చెక్కు అందజేత



సలోమికి చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ తిరుమలేశ్వరరావు

కొత్తవలస: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) పథకంలో భాగంగా ఎల్.కోట మండలం కళ్లేపల్లి గ్రామానికి చెందిన అట్టాడ జోసెఫ్ కుటుంబానికి రూ.2లక్షల బీమా పరిహారం మంజూరైంది. సంబంధిత చెక్కును మృతుడి భార్య, నామినీ అయిన సలోమికి స్థానిక ఏపీజీవీబీలో మేనేజర్ తిరుమలేశ్వరరావు శనివారం అందజేశారు.జోసెఫ్‌కు కొత్తవలస ఏపీజీ వీబీలో ఖాతా ఉండడంతో పాటు పీఎంజేజేబీవై పథకంలో బీమా చేయించుకున్నారు. ఇటీవల ఆయన మరణించడంతో బీమా మంజూరైంది.

సన్మానం

కొత్తవలస ఏపీజీవీబీ మేనేజర్ తిరుమలేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా పొందూరు శాఖకు చీఫ్ మేనేజర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు.ఆయన్ని స్థానిక బ్యాంకు సిబ్బంది సన్మానించారు. బ్యాంకు సీఎస్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై వరి విత్తనాలను సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలను రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ రమణమూర్తి, వార్డు మెంబర్ మహంతి రాజారావు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా చండీయాగం

విజయనగరం టౌన్: జేష్ఠ పౌర్ణమితో పాటూ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో శనివారం చండీయాగం నిర్వహించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా యాగాన్ని చేపట్టారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను యాగంలో పాల్గొన్న భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జగన్నాథునికి జ్యేష్టాభిషేక పూజలు



జామి: పుష్పగిరి వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



జామి: భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న స్వామి వారు



శృంగవరపుకోట: ఎస్.కోట వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథ స్వామికి అభిషేకాలు. పూజలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: పౌర్ణమి సందర్భంగా పూరీ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ పూజారిని దేవి నేతృత్వంలో ఆలయంలో శనివారం ప్రత్యేక శోభా మండపం ఏర్పాటు చేసి జగన్నాథ, సమేత సుభద్ర, బలరాముల మూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభిషేకాలు చేసి, పూజలు చేశా రు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేకంగా పూజాధికాలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో

జామి: పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో పూరీ జగన్నాథస్వామికి శనివారం జ్యేష్టాభిషేక పూజలు చేశారు.అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే మండ ల కేంద్రం జామిలోని మూడుకోవెళ్ల ప్రాంగ ణంలో జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

జామి: భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. వేదపండితులు పుష్పయాగం చేశారు. అలాగే శనివారం ఉదయం ఆలయ ప్రధానఅర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రాజరాజేశ్వరీదేవికి పూజలు

బొండపల్లి: దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

# ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్ఈసీఎస్)ను పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది ఆర్ఈసీఎస్‌లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అందులో చీపురుపల్లి ఆర్ఈసీఎస్ ఒకటని పేర్కొన్నారు. చీపురుపల్లి ఆర్ఈసీఎస్ ప్రజలకు, రైతులకు ఎంతో విలువైన సేవలు అందిస్తూ లాభాల బాటలోనే నడిచిందన్నారు. ఆర్ఈసీఎస్ ద్వారా చీపురుపల్లి ప్రాంతంలో వ్యవసాయ బోర్లు అధికంగా ఉండడంతో రైతులు పంటలు సాగు చేసుకుని పిల్లలను చదివించుకుంటూ అభివృద్ధిలోకి వచ్చారని చెప్పారు. ఆర్ఈసీఎస్ పరిధిలో దాదాపు పది వేల వరకు వ్యవసాయ బోర్లను రైతులు వినియోగిస్తున్నారని చెప్పారు. పది వేల విద్యుత్ సర్వీసులతో ప్రారంభమైన ఆర్ఈసీఎస్ ప్రస్తుతం 70 వేలకు పైగా విద్యుత్ సర్వీసులకు సేవలు అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఆర్ఈసీఎస్‌ను రద్దు చేసి ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసిందని పేర్కొన్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చీపురుపల్లి బహిరంగ సభలో ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అందుకే స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాలకృష్ణతో కలిసి సీఎం చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించి, చీపురుపల్లి ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరణకు విజ్ఞప్తి చేయాలని కోరారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# హైరిస్క్ గర్భిణులను గుర్తించండి



కొర్లాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు



గంట్యాడ పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ

• డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

గంట్యాడ: గ్రామాల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి తగిన వైద్యసేవలు అందేలా చూడాల్సిన బాధ్యత ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలపై ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. మండలంలోని కొర్లాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందించిన వైద్యసేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వెల్ నెస్ సెంటర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న గర్భిణులను పీహెచ్‌సీకి తరలించి వారికి రక్తం పెరగడానికి అవసరమైన ఇంజెక్షన్‌లు ఎక్కించాలని తెలిపారు. అలాగే రక్తం ఎక్కించాల్సిన వారిని విజయనగరం ఘోషాస్పత్రి, మహారాజ ఆస్పత్రికి కాని, సీహెచ్‌సీకి కాని తరలించి రక్తం ఎక్కించాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలితే తక్షణమే సంబంధిత వైద్యాధికారికి తెలియజేసి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జ్వరపీడితులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. అనంతరం గంట్యాడ పీహెచ్‌సీలో తనిఖీలు చేశారు.ఓపీ నమోదును పరిశీలించారు. 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి హేమలత, ఎంపీహెచ్ఈఓలు చంద్రశేఖరరాజు, మూర్తి, కె. ఎర్రన్న తదితరులు ఉన్నారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. హరిహరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆరోజు ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందనిపేర్కొన్నారు.సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల మండల అధికారు హాజరు కావాలని కోరారు.

## అడ్మిషన్‌లకు ఈనెల 30 వరకు గడువు



విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఅడ్మిషన్‌లకు ఈనెలాఖరు వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం పలువురు విద్యార్థులకు శనివారం ఆయన అడ్మిషన్‌లు ఇచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో నిష్ణాతులైన 23మంది అధ్యాపకులతో పాటు అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెలాఖరులోగా జాయిన్ కావాలని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## అక్రమంగా ఇసుక రవాణా



ఇసుకను గోనె సంచుల్లో నింపి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

గజపతినగరం: స్థానిక చంపావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. గోనె సంచుల్లో ఇసుక నింపి ట్రాక్టర్‌లు,బొలేరోల ద్వారా తరలిస్తున్నారు. చంపావతి నదిలో సుమారు 40 గ్రామాలకు తాగునీ రు సరఫరాచేసే పంప్ హౌస్ షెడ్ల సమీపంలో ఇసుకు తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక తవ్వకాల ప్రభావం పంప్ హౌస్‌లపై పడుతుందని, తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: వేణుగోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు) పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి శనివారం ఓప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలనిసూచించారు.విద్యార్థులు ఏ గురుకుల పాఠశాలలో చేరాలని కోరుకుంటున్నారో వారికి అదే పాఠశాలలో ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహించునున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థి ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో హాజరు కావాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ,రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

## 24 నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: ఈనెల 24 నుంచి ప్రతీ సోమవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని మొదటి అంతస్తులో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం మొదలవుతుందన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# నోట్ పుస్తకాల పంపిణీ



చీపురుపల్లిరూరల్(గరివిడి): ఐతంవలసలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆశయ సంస్థ రమణ



జామి: శాశనపల్లి పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న దాత వెంకటరావు, తదితరులు



వేపాడ: వాసవీ క్లబ్ సభ్యులు అందజేసిన విద్యాసామగ్రితో బల్లంకి పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): మండలంలోని గదబవలస పంచాయతీ పరిధి ఐతంవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చీపురుపల్లికి చెందిన ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో విద్యార్థుల కు పుస్తకపఠనంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రెడ్డి రమణ మాట్లాడుతూ గ్రామీణప్రాంత విద్యార్థుల కోసం 19 ఏళ్ల నుంచి ఆశయసంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులు పుస్తకాల బాట పట్టాలనే ఉద్దేశంతో సంచార గ్రంథాలయాన్ని అందుబాటు లోకి తీసుకువచ్చామన్నారు. హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయిని రమా దేవి, పీఎంసీ చైర్మన్ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

జామి: మండలంలోని శాశనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన వెంకటరావు సుమారు రూ.12 వేలు విలువైన పెన్నులు, నోట్ పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ బి.వెంకటఅప్పారావు,మాజీ ఎంపీటీసీ కొత్తలి సూర్యారావు, హెచ్ఎం పైడిపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

వేపాడ: బల్లంకి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేపాడ మండల వాసవీ క్లబ్ సభ్యులు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర విద్యాసామగ్రిని శనివారం అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



లక్కవరపుకోట: ఎల్.కోటలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ గోపాలరావు

లక్కవరపుకోట: ఆరోగ్యానికి హాని కలిగించే, భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆర్.గో పాలరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించా రు.ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎంతో మంది యువత మత్తుపదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశ నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మత్తుపదార్థాల రవాణా, వినియోగం నేరమని తెలిపారు.గంజాయి, కొకైన్ వంటి నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఎస్ఐ సత్యం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



బొండపల్లి: బోడసింగిపేటలోని ఆదిత్య కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బొండపల్లి: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థుల దూరంగా ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై బోడసింగిపేట గ్రామంలోని ఆదిత్య జూనియర్ కళాశాల, వివే కానంద స్కూల్‌లో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదా ర్థాలను అరికట్టేందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు. పోలీస్ సిబ్బందితో పాటు, వివేకానంద స్కూలు కరస్పాండెంట్ పి.శివాజీరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల తొలగింపు సరికాదు



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజిలో మెకానిక్‌లు, హెల్పర్లుగా పనిచేస్తున్న వారిని అక్రమంగా తొలగించడం అన్యాయమని సీఐటీయూ నేతృత్వంలో కార్మికులు, నాయకులు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆర్టీసీ కార్మికులు మాట్లాడుతూ ఎస్.కోట డిపో నుంచి పలు వురి ని విజయనగరం డిపోకు వెళ్లాలని అధికారులు ఆదేశిస్తూ వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. గతంలో ఇక్కడ ఇద్దరు మెకానిక్‌లు, ఇద్దరుహెల్పర్లు ఉన్నప్పుడు నాలుగు బస్‌లు రిపేర్ చేసేవారమని, ఇప్పుడు ఒక మెకానిక్, ఇద్దరు హెల్పర్లు ఉండగా ఆరు బస్సులు రిపేర్ చేయిస్తున్నారని వాపోయారు. అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని వారంతా డిమాండ్ చేశారు. కె.సురేష్, డి.నరేష్, పి.పి.సాహెబ్, ఎస్.నాగేశ్వరరావు, డి.గణేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల సందర్శన



శింగరాయిలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు



పాటూరు పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఎంఇఓ-1 జగదీశ్వరరావు

వేపాడ: మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 జగదీశ్వరరావు, శింగరాయి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం సందర్శించారు.విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. స్టూడెంట్స్ కిట్‌లు అందాయా లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. రోజూ యూనిఫాం ధరించి స్కూల్‌కు రావాలని సూచించారు. వారి వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఎస్పీలు ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



అంధ విద్యార్థులకు స్టిక్స్ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: ప్రతి ఒక్కరూ సంవత్సరంలో ఒకరోజు సమాజ సేవ చేయాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అదనపు కోశాధికారి కాల్వ హరికృష్ణ పిలుపునిచ్చారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజానికి సేవ చేసేందుకే వాసవీ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సభ్యుడు సేవే పరమావధిగా పనిచేయాలని కోరారు. వాసవీ క్లబ్ విజయనగరం, వనిత విజయం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మురళీకృష్ణ పర్యవేక్షణలో పేద వర్తకులకు గొడుగులు, అంధ విద్యార్థులకు స్టిక్స్, వీధి వ్యాపారులకు తోపుడు బళ్లు, హయగ్రీవ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, చాక్లెట్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నాబుచ్చి జనార్దనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్‌కుమార్, సహకోశాధికారి విన్నకోట రమేష్, గుంపిన ఇందిర, వాసవీ వనిత విజయం అధ్యక్షురాలు పి.ప్రభావతి, కందుల సంతోష్, రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు, ఏవీఎస్ కుమార్, గూడూరు నరసింగరావు, గుంపిన నారాయణరావు, ఏడుకొండలు, మండవిల్లి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బింగివీధిలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. డక్కిన వీధి, బింగి వీధి, తదితర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న టిఫిన్ షాపుల వద్ద సదరు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లతో చెత్తాచెదారం వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. వ్యాపారులను పిలిచి వారికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు, క్యారీ బ్యాగులు వినియోగిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండాలన్నారు. వీధుల్లో చెత్తాచెదారం వేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరి సహకారం అవసరమని కోరారు.